క్లుప్తంగా

వెల్లటూరులో గణపతి హోమం



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో పంచాయతన దేవాలయాలలో కొలువైన ప్రథమ పూజాధిపతి సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి వారి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. తాడి కొండ వంశీయులు ప్రసన్నకుమార్ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి (చందూ మాస్టర్) పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు.

పెసర్లంకలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



పెసర్లంక(భట్టిప్రోలు): పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో–2 నీలం దేవరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించడం ద్వారా విద్యార్థుల నుంచి సత్ఫలితాలు రాబట్టవచ్చునని తెలిపారు. అలాగే నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానంతో బోధన ఏ విధంగా నిర్వహించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెల్లటూరు, బలవరం జెడ్పీ హైస్కూల్స్ హెచ్ఎంలు కె.అరుణకుమారి, మాచర్ల మోహన్‌రావు, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె: ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27 నుంచి మూడవ దశ డిగ్రీ ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలలో ప్రవేశానికి ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె: జగనన్న ఆరోగ్య రక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ రెడ్డి శివశంకరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా పట్టణంలోని 7వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ పథకం ద్వారా ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరమైన సమస్యలు తెలుసుకుని వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దామెర్ల శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 27న బుధవారం ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పట్టణంలోని జేఎల్‌బీ కళాశాల రోడ్డు, బస్టాండ్ నుంచి నిజాంపట్నం రోడ్డు, ఉప్పూడి రోడ్డు, గరువు రోడ్డు, జగనన్న కాలనీలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల అరెస్ట్‌కు నిరసనగా ధర్నా

రేపల్లె: అంగన్‌వాడీల అరెస్టును నిరశిస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బస్టాండ్ సెంటరులో నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీలపై అవగాహన

మంగళగిరి: నగరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మలేరియా, డెంగీ జ్వరాలను గుర్తించి చికిత్స అందించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ తమ పరిధిలో ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ ఎం సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంటు శ్రీనివాస్, నరసింహారావు, మూర్తి పాల్గొన్నారు.

ఊపందుకున్న భూముల రీ–సర్వే

- ముమ్మరంగా వేమూరులో మూడో విడత సర్వే కార్యక్రమం
- మూడు దశల్లో వేగంగా భూ స్వచ్ఛీకరణ



చావలి గ్రామంలో రీ సర్వే చేస్తున్న సర్వేయర్లు

వేమూరు: వైఎస్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా నూరేళ్ల తర్వాత భూమి కొలతలు, రికార్డుల స్వచ్ఛీకరణ కోసం చేపట్టిన రీ–సర్వే పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వేమూరు నియోజకవర్గంలో రెండు విడతల్లో నాలుగు గ్రామాల్లో మాత్రమే సర్వే పూర్తిగా కాగా.. ప్రస్తుతం ఐదు మండలాల్లో ఈ ప్రక్రియను అధికారులు మరింత వేగవంతం చేశారు. మొదటి రెండు విడతల్లో వేమూరు మండలంలో పోతుమర్రు, పులిచింతలపాడు, చుండూరు మండలంలో తొట్టెంపూడి, కొల్లూరు బద్దులూరుపాడు గ్రామంలో రీ సర్వే పూర్తయ్యింది. మూడో విడతలో 12 గ్రామాల రీ–సర్వే కోసం ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 89 గ్రామాల్లో 95 వేల ఏకరాలను సర్వే చేపట్టాల్సి ఉంది. మూడో విడతలో మూడు రకాలుగా రీ–సర్వే చేస్తున్నారు. వేమూరు మండలంలో చదలవాడ, కొల్లూరు మండలంలో రావికింపాడు, అమర్తలూరు మండలంలో గోవాడ, బోడపాడు, భట్టిప్రోలు మండలంలో పల్లికోన, చుండూరు మండలంలో పెనురుద్ర పాడు, గ్రామాల్లో సర్వేయర్లు పొలాల పర్యటన చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలోని గొరికపూడి, కోనేటి పురం, కొల్లూరు దోనేపూడి, వేమూరులో చావలిలో రీ–సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు, వేమూరులో బలిజేపల్లి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

మూడో విడత రీ సర్వే...

ప్రతి రైతు భూమిని రీ–సర్వే చేసి, వివరాలు మరోసారి పరిశీలన చేసి, వాస్తవికత ఆధారంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో జరిగిన రీ–సర్వే లో క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పేరుకు పోయాయి. వాటిని పరిష్కరించేందుకు గత పాలకులెవరూ దృష్టి సారించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భూములు రీ–సర్వే చేసి రికార్డుల స్వచ్ఛీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరలా భూ సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూడో విడత అక్టోబరు 30వ తేది లోపు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మూడో విడత పూర్తయిన తర్వాత మిగిలిన గ్రామాలు రీ –సర్వే చేయడం జరుగుతుంది.

తప్పులు లేకుండా పరిశీలన



ప్రతి భూ హక్కు పత్రంలో పట్టాదారు పాస్ పుస్తకంలోని వివరాలు ప్రగడ్బందీగా పరిశీలన చేయడం జరుగుతుంది. సర్వేయర్లు దగ్గర ఉండి రీ–సర్వే చేస్తారు. ఇందులో ఎలాంటి అవకతవకలకు తావుండదు.

– గోపీ, మండల సర్వేయర్, వేమూరు.

పొన్నూరు ఆర్టీసీ బస్ స్టేషన్‌కు మహర్దశ



ప్రారంభానికి సిద్ధమైన పొన్నూరు ఆర్టీసీ బస్ డిపో

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఆర్టీసీ (ప్రజా రవాణా సంస్థ) దినదినాభివృద్ధి చెందుతుంది. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే కాకుండా ఆర్టీసీ అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుంది. శిథిలావస్థలకు చేరి దీనస్థితిలో ఉన్న బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరి ప్రజాదరణకు దూరమైన పొన్నూరు ఆర్టీసీ బస్ స్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టింది. రూ. 25 లక్షల ప్రభుత్వం మంజూరు చేసింది. వెంటనే బస్ స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగాయి.

నెరవేరిన పొన్నూరు ప్రజల దశాబ్దాల కల...

పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరడంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి చర్యలతో బస్టాండ్‌కు మోక్షం లభించింది . ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య కృషితో బస్ స్టేషన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెంది ఈనెల 30వ తేదీన పునః ప్రారంభానికి సిద్ధమైంది. బస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు..

బస్ స్టేషన్‌ను అన్ని హంగులతో ఆధునీకరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బెంచీలు, బస్టాండ్ ఆవరణంతా సీసీ రోడ్డు, టాయిలెట్స్ అభివృద్ధి, డిపోను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్‌ను త్వరితగతిన అందుబాటులో తెచ్చే విధంగా అధికారులు తమ బాధ్యతలు నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



తెనాలిఅర్బన్: రక్తదానం చేయడం వలన ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ జానీ పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ–కాలేజ్ యూత్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో మంగళవారం సాయంత్రం రక్తదానం చేయడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. రక్త శాతాన్ని పెంచుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి భానుమతి, జేఎంజే యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి



తెనాలిఅర్బన్: వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ కోరారు. ప్రపంచ పర్యావరణ, ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావితరాల భవిష్యత్ కోసం ప్రకృతిని పరిరక్షించాల్సిన అవసరం అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ కీర్తి చేకూరి



బిల్డింగ్ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి

నెహ్రూ నగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాల ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా, సెట్ బ్యాక్‌లో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ వసంతరాయపురంలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను, శారదా కాలనీ, మల్లికార్జున పేట, భారత్ పేట, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ర్యాంప్‌లు రోడ్ మీదకు రాకుండా చూడాలని, ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్ లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందని హెచ్చరించారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలని, రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్ లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలన్నారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. అలాగే ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలించి కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య పనులకు బాధ్యత వహించాలని, గ్యాంగ్ వర్క్ పనుల రిపోర్ట్ ప్రతి రోజు తమకు పంపాలన్నారు. డంపర్ బిన్ల దగ్గర అపరిశుభ్రం లేకుండా చూడాలని, సెకండరీ కలెక్షన్ పాయింట్స్ నుండి నిర్దేశిత సమయంలో చెత్త తరలించాలని ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాబూరావు, టీపీఓ నాగ వల్లి, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్ మల్లి సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీడియోగ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుట్టగుంట మల్లికార్జునరావు సంతాప సభను మంగళవారం కొత్తపేటలోని ఎన్‌జీవో హోంలో నిర్వహించారు. ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్, ఎస్‌బీఐ గంగానమ్మపేట బ్రాంచి మేనేజర్ విష్ణు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

అద్దేపల్లిలో 'ఆరోగ్య సురక్ష సర్వే'



అద్దేపల్లి(భట్టిప్రోలు): జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే భట్టిప్రోలు–2 సచివాలయం పరిధిలోని అద్దేపల్లిలో నిర్విరామంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి టోకెన్లు అందజేస్తున్నారు. వచ్చే నెల 4న జరిగే జనన్న ఆరోగ్య సురక్షా శిబిరంలో నిష్ణాతులైన వైద్యులు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి.రత్నకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ జి.బ్యూలా, ఆశ కార్యకర్తలు సీహెచ్ పాప, ఎన్. శ్రీలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ



కొల్లిపర: మండలంలోని వివిధ స్కూల్ కాంప్లెక్స్‌లో ఆజాదీకా మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి –నా దేశం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి జాతీయ జెండాలతో ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటు వంటి కార్యక్రమాలు ప్రాథమిక పాఠశాల స్థాయిలో నిర్వహించడం వలన చిన్నారులల్లో జాతీయ సమైక్యత పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ– 2 ఝాన్సీలత, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవ రెడ్డి, విశ్రాంత ఎంఈఓ బసవకుటుంబరెడ్డి, సీఆర్‌పీ రమేష్ పాల్గొన్నారు.

వ్యర్థాలను కాలువలో వేయవద్దు



తెనాలిఅర్బన్: ఇళ్లు, దుకాణాల్లో ఉత్పత్తి అయిన వ్యర్థాలను చెరువులో వేయడం వలన నీరు కలుషితం అవడంతో పాటు దుర్వాసన వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రజక చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, శానిటేషన్ సెక్రటరీలు ఎన్.ప్రవీణ్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధమవ్వాలి



బాపట్ల: సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రంలో మిగిలి ఉన్న ప్రభుత్వ బంజరు భూములను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 90 ఏళ్లగా భూమి కోసం, భుక్తి కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి, పేదలకు భూములు పంపిణీ చేయించామని తెలిపారు. బీకేఎంయూ జాతీయ ఉపాధ్యక్షుడు రామమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కార్యదర్శి ఆవుల శేఖర్, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేస్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులు జేబీ శ్రీధర్, తన్నీరు సింగరకొండ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఎంపికలు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రేపల్లె రూరల్: పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ హైస్కూలు గ్రౌండ్‌లో రేపల్లె నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ బాలుర పోటీలు మంగళవారంతో ముగిశాయి. నాలుగు మండలాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ యడ్ల రమేష్‌బాబు మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాలలో బాల, బాలికలకు విడివిడిగా ప్రతి క్రీడలో అండర్–14, అండర్–17 విభాగాలలో ఎంపికలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు ఎం.సాంబశివరావు, జీ.కుటుంబారావు, భాస్కరరావు, ఆర్.సుబ్బారావు, కే.శ్రీనివాసరావు, కె.బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మోహనరావు

వేమూరు: ప్రతి ఒక్కరూ 18 ఏళ్లు నిండిన అనంతరం తమ ఓటు నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక ఎన్నికల అధికారి జె.రామోహనరావు అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని కొన్ని బూత్‌ల మార్పులు, చేర్పులు పూర్తయిందన్నారు. అక్టోబరు 27న జాబితా విడదల చేయడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని ఆయన కోరారు. ఎన్నికలు నిర్వహించే వరకు ప్రతి మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు బొల్లిముంత ఏడుకొండలు, గాదె శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ యల్లమాటి మోహన్, దండే సుబ్బారావు, మైనేని మురళీ, దున్నా మేరీ సుబాబు, దొప్పలపూడి జ్యోతిబాబు మండల ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో జమ్ములపాలెం విద్యార్థుల సత్తా



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

బాపట్ల అర్బన్ : బాపట్ల నియోజకవర్గ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్ –14, 17 పోటీల్లో జమ్ములపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం బాపట్ల మునిసిపల్ పాఠశాలల నియోజకవర్గ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ నిర్వహించారు. బాలుర అండర్–14 విభాగంలో నరేష్, సాయి షబ్బీర్, శరత్‌బాబు, సాత్విక్, చిట్టిబాబు, సతోష్, సీహెచ్ శివమణి, బాలికల విభాగాల్లో అనురాధ, చాందిని, సుప్రజ, జ్యోతిర్మయి, నయిన, మరియమ్మ, శివకామేశ్వరి ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో శ్రీనిచల్, గమనియేలు, సాగర్, కరిముల్లా, విజయ్, రూజ్ వెల్ట్, సోహెల్, బాలికల విభాగంలో ఉమామాధవి, యామిని, మనీషా, దివ్య, మోహసిన్, సింధుప్రియ, గాయత్రి స్థానం సాధించారు. హై జంప్‌లో చరిష్మా, గాయత్రి, శరత్, షార్ట్ పుట్‌లో షేక్ నందిని, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వీరనారి చాకలి ఐలమ్మ



పార్కులోని ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

తెనాలి: భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ, పీడన నుంచి విముక్తి కోసం నాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరలను ఎదిరించి నిలిచిన చాకలి ఐలమ్మ చిరస్మరణీయురాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రజక చెరువు పార్కులోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ తెలంగాణలో పేద వర్గాల హక్కుల కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ పోషించిన ప్రముఖ పాత్రను వివరించారు. నేటితరం ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రజల కోసం పాటుపడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి అన్నవరపు మల్లేశ్వరరావు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు, సంఘ పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, ద్వారకా శ్రీను పాల్గొన్నారు.

కాల్ చేసుకుంటానని ఫోన్‌తో ఉడాయించాడు

మంగళగిరి: నగరంలో రెండు సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన ఘటనలు మంగళవారం చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నుంచి పానకాల లక్ష్మీనృసింహస్వామి కొండకు వచ్చిన భక్తుడు రంగయ్యను ఓ యువకుడు గుడికి వచ్చిన తమ వారు కనిపించడం లేదని ఒకసారి ఫోన్ ఇస్తే ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పి ఫోన్ తీసుకున్నాడు. రంగయ్య తమ కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా యువకుడు సెల్‌ఫోన్‌తో పరారయ్యాడు. కంగుతిన్న రంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని హుస్సేన్ కట్ట వద్ద యువకుడు పడిపోతున్నట్లు నటించగా స్థానికంగా ఉంటున్న మద్ది శివప్రసాద్ పట్టుకునేందుకు ప్రయత్నించాడు. యువకుడు శివప్రసాద్ జేబులోని ఫోన్ లాక్కుని పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి దుండగులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

నగరంలోని కొత్తపేటలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొత్తపేటకు చెందిన నవీన్ సోమవారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా ద్విచక్రవాహనం కనిపంచలేదు. దీంతో నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

రేపు గుర్రం జాషువా జయంతి

తెనాలి: గుర్రం జాషువా విజ్ఞాన సమితి, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నవయుగ కవి చక్రవర్తి జాషువా 128 జయంతిని నిర్వహించనున్నారు. స్థానిక ఎన్జీవో కల్యాణమండపంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సభలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాష్ట్ర మండల విద్యాశాఖాధికారుల సంఘం అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాజగోపాల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సాయంత్రం 4–6 గంటల మధ్య కళాకారులతో జాషువా పద్యగానం ఉంటుందని చెప్పారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారని సమితి అధ్యక్షుడు జుజ్జవరపు న్యూటన్ తెలిపారు.